క్లుప్తంగా

పుస్తకాల పంపిణీ ప్రారంభం



శిరివెళ్ల ఉన్నత పాఠశాలలో పుస్తకాలను పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం

శిరివెళ్ల: మండలంలో శుక్రవారం నుంచి విద్యార్థులకు పుస్తకాల పంపిణీ ప్రారంభమైంది. స్టూడెంట్ కిట్‌లో భాగంగా మొదట 1–10 వ తరగతుల్లోని 5,194 మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బెల్టులను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు విద్యార్థులకు అందజేశారు. హెచ్‌ఎం విజయకుమార్, టీచర్లు పాల్గొన్నారు.

నీట్ ఫలితాలపై విచారణ జరిపించాలి

నంద్యాల(న్యూటౌన్): నీట్ ఫలితాల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుమల్ల శ్రీధర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఆర్‌ఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ మెడికల్ విద్యను అభ్యసించడానికి జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ ఫలితాల్లో జరిగిన అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలన్నారు. నాగరాజు పాల్గొన్నారు.

చేగువేరా జయంతి



చేగువేర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక డీవైఎఫ్‌ఐ పట్టణ కమిటీ కార్యాలయంలో శుక్రవారం విప్లవ వీరుడు చేగువేరా జయంతిని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీవైఎఫ్‌ఐ కార్యదర్శి శివ, పట్టణ ఉపాధ్యక్షులు మాబాషా, సాయి మాట్లాడుతూ చేగువేర ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటు పడాలన్నారు. ప్రసాద్, బన్ని, హరి, సాయి, జబీవుల్లా పాల్గొన్నారు.

పండరీ భాగవతం మోక్షప్రదాయం

నంద్యాల(వ్యవసాయం): పండరీ నాథుని భాగవతం చదివినా, విన్నా మోక్షం లభిస్తుందని తిరుమల తిరుపతి దేవస్థానం బ్రహ్మోత్సవ వ్యాఖ్యాత డాక్టర్ దీవీ హయగ్రీవాచారి అన్నారు. కోటావీధిలోని రమాసమేత సత్యనారాయణస్వామి దేవాలయంలో శుక్రవారం మహారాష్ట్ర పండరీ పురంలో పండరీనాథ భక్తులకు సంబంధించిన కథనాలను భక్తులకు శ్లోకాల రూపంలో వినిపించారు. అలాగే స్వామి మహిమలు, వైశిష్టం గురించి వివరించారు. ఆలయ ఈఓ నాగప్రసాద్, దేవస్థానం చైర్మన్ యాడికి శ్రీదేవి పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపు



కర్నూలు కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న ఆనంద్‌గురూజీ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో ఆయూష్ యోగా సేవా సమితి నిర్వాహకులు, యోగా గురువు కండే ఆనంద్ గురూజీకి రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన అవార్డు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా తాను రక్తదానం చేస్తూ రక్తదాతలకు అవగాహన కల్పిస్తూ రక్తదాన శిబిరాలుఏర్పాటు చేశామన్నారు. అందుకు అవార్డు అందజేయడం సంతోషంగా ఉందన్నారు.

పర్సా సేవలు మరువలేనివి



రక్తదానం చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్):కార్మికులకు, ఉద్యోగులు, సీఐటీయూ అభివృద్ధికి పర్సా సత్యనారాయణ చేసిన సేవలు మరువలేనివని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, ప్రభుత్వ జిల్లా జనరల్ ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ ప్రసాద్, మెడికల్ ఆఫీసర్ లింగేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏపీ ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేసిన సత్యనారాయణ శత జయంతి ఉత్సవాల సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షుడు తోటమద్దులు, బాలవెంకట్, వెంకటలింగం, మిట్నాల తిరుపతయ్య, జైలాన్, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు దస్తగిరి, నాగరాజు పాల్గొన్నారు.

‘మధ్యాహ్నం’లో నాణ్యత లోపిస్తే చర్యలు

నంద్యాల(అర్బన్): విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఎంఈఓ బ్రహ్మంనాయక్ హెచ్చరించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వాహకులు ప్రతి విద్యార్థికి అందేలా చూడాలని సూచించారు. మండలంలోని పొన్నాపురం ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని శుక్రవారం హెచ్‌ఎం శ్రీనివాసులుతో కలిసి పరిశీలించారు.

వామ్మో.. ఊరగాయ!

ఈ సీజన్‌లో ఊరగాయ తయారు చేసి నిల్వ ఉంచుకొని ఏడాదంతా తింటారు. ప్రస్తుతం మామిడికాయ పచ్చడి తయారీకి అనుకూల సమయం. ముఖ్యంగా తెలుగు ప్రజలు ఇష్టపడే మామిడి పచ్చళ్లలో పలు రకాలు చేసుకుంటారు. అయితే వాతావరణ పరిస్థితుల కారణంగా దిగుబడి తగ్గడంతో మామిడి కాయల ధరలు పెరిగిపోయాయి. గతేడాది డజను కాయలు రూ.300 నుంచి రూ.400 పలికాయి. ప్రస్తుతం కాయ రకాలను బట్టి రూ.400 నుంచి రూ.600 వరకు ఉంది. ఇక ఊరగాయకు అవసరమైన సరుకుల ధరలు కూడా పెరిగిపోవడంతో వంద కాయలతో పచ్చడి చేసుకోవాలనుకునేవారు సగానికే పరిమితమవుతున్నారు.

- పెరిగిన మామిడి కాయలు, సరుకుల ధర
- వాతావరణ పరిస్థితుల ప్రభావంతో తగ్గిన దిగుబడులు
- వెనుకంజ వేస్తున్న జనం



ఊరగాయకు ఉపయోగించే మామిడికాయలను విక్రయిస్తున్న వ్యాపారి

నంద్యాల(న్యూటౌన్): తొలకరి జల్లుల నాటికి కారం కారంగా ఇష్టమైన ఊరగాయలను తయారు చేసుకొని ఇంట్లో నిల్వ చేసుకుంటాయి తెలుగు లోగిళ్లు. వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల ఎండలు దోబూచులాడటంతో ముందస్తుగానే ఊరగాయ తయారీకి సిద్ధపడుతున్నారు జనం. ఊరగాయల్లో ఉపయోగించే ముడి సరుకుల ధరలు గత ఏడాది పోలిస్తే ఈ ఏడాది రెట్టింపయ్యాయి. దీంతో పేద, మధ్యతరగతి వర్గాలకు ఊరగాయ చేసుకోవడం భారంగా మారింది. మామిడి పూత సమయంలో విపరీతమైన మంచు కురవడంతో పూత రాలిపోయి దిగుబడిపై ప్రభావం చూపింది. అలాగే ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల ఎండు మిర్చి, మెంతులు, ఆవాలు, వెల్లుల్లి పంటల దిగుబడి అంతంత మాత్రంగానే ఉండటం, వేరుశనగ, గానుగ నూనెల కొరత వల్ల వాటి ధరలు అమాంతం పెరిగిపోయాయి. నంద్యాల ప్రాంతంలో పచ్చళ్ల తయారీకి వినియోగించే మామిడి రకాలు మార్కెట్లో ధరలు అధికంగా ఉన్నాయి. అయితే కొందరు మాత్రం ధరలు ఎక్కువగా ఉన్నా మామిడి కాయల కొనుగోలు చేస్తున్నారు. గతంలో 100 మామిడి కాయలతో ఊరగాయను తయారు చేసుకునే వారు ప్రస్తుతం సగానికే పరిమితమవుతున్నారు.

ఊరగాయ అంటే అందిరికీ మక్కువే..

జిహ్వకు వహ్వా అనిపించే ఆవకాయ, ఎండు, పచ్చి మాగాయ, ఉల్లి, అవకాయ, తదితర పచ్చళ్లు అంటే ఇష్టపడని వారుండరు. కూర లేకపోయినా పర్వాలేదు. నాలుగు పచ్చడి మెతుకులు తినొచ్చులే అనే భావనతో చాలా మంది ఉంటారు. పచ్చళ్ల సీజన్ కావడంతో పాండురంగాపురం, బాబానగర్, సుబ్బారెడ్డిపాలెం, నంద్యాల పట్టణం, తదితర ప్రాంతాల్లోని ముఖ్య కూడళ్లలో మామిడి కాయలతో మార్కెట్లు కిటకిటలాడుతున్నా.. కొనుగోలు మాత్రం అంతంత మాత్రంగానే ఉందని వ్యాపారులు చెబుతున్నారు. సాధారణంగా పెద్ద రసాల రకాల మామిడి కాయలను పచ్చళ్లకు వినియోగిస్తారు. డజను కాయలు రూ.400 నుంచి రూ.600 వరకు పలుకుతోంది. ఆచారి రకం కాయలకు మరింత డిమాండ్ ఉంది. ఇక వాటిని కొని కడిగి ముక్కలు చేయడానికి కాయకు రూ.8 నుంచి రూ.10 వరకు తీసుకుంటున్నారు.

ఊరగాయకు అవసరమైన సరుకుల ధరలు

సరుకులు	గత ఏడాది కేజీ ధర రూ.ల్లో	ఈ ఏడాది కేజీధర రూ.ల్లో
అవకాయ	400	550
మగాయ కారం	300	450
గానుగనూనె	300	350
వేరుశనగ నూనె	150	200
నువుల నూనె	380	470
ఆవాలు	100	200
మెంతులు	100	200
వెల్లుల్లి	100	200

ధరలు అధికంగా ఉన్నాయి



మా కుటుంబంలో అందరూ పచ్చళ్లను ఇష్టంగా తింటారు. ప్రతి ఏడాది మామిడి, నిమ్మ, టమాట పచ్చళ్లను ఇంట్లోనే సొంతంగా తయారు చేసుకుంటాం. ఈ ఏడాది మామిడి కాయల ధరలు అధికంగా ఉన్నాయి. పచ్చడికి అవసరమైన సరుకుల ధరలు కూడా పెరిగిపోయాయి. ముఖ్యంగా కారం, నూనెల ధరలు మండుతున్నాయి. ఏటా ఏడాదికి సరిపడేలా చేసుకుంటాం. ఈ ఏడాది ఆరు నెలలకు సరిపడేలా చేసుకున్నాం.

– రాజకుమారి, జ్ఞానాపురం, నంద్యాల

వ్యాపారం బాగానే ఉంది



మామిడి కాయల ధరలు పెరిగినా ఎక్కువ కొనుగోలు చేసేవారు తక్కువ కొంటున్నారు. అయినా వ్యాపారం పర్వాలేదు. ప్రస్తుతం పచ్చడి కాయలు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. మామిడి కాయలతో పాటు నిమ్మ, మునగ, టమాట వంటివి కూడా పచ్చళ్లు పెట్టుకోవడానికి ఇది అనువైన సమయం.

–శ్రీనివాసులు, రైతు,వ్యాపారి, ముత్యాలపాడు

దరఖాస్తు చేసుకోండి

రుద్రవరం: మండలంలోని తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాలలో 7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఈనెల 18వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు తెలిపారు. శక్రవా రం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 7,8,9 తరగతుల్లో కొన్ని సీట్లు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేసేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ఆసక్తి గల వి ద్యార్థులు ఆధార్‌కార్డు, పాస్ ఫొటోతో వచ్చి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఈ నెల 20న ఉదయం 10 గంటలకు ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు.

టెండర్లకు ఆహ్వానం

నంద్యాల టౌన్: నంద్యాల రీజియన్ పరిధిలోని పలు ఆర్టీసీ డిపోల్లో ఔట్ సోర్సింగ్ పనులు చేయటకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి రజియా సుల్తానా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నందున గతంలో విడుదల చేసిన నోటిఫికేషన్ రద్దు చేశామని, ప్రస్తుతం కోడ్ ముగియడంతో అవే పనులకు టెండర్లు పిలుస్తున్నట్లు చెప్పారు. ఈనెల 20వ తేదీ వరకు టెండర్లకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. వివరాలకు సమీపంలోని ఆర్టీసీ డిపో ఆఫీస్‌లో సంప్రదించాలని సూచించారు.

మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజీనామా

నంద్యాల (సెంట్రల్): నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ దేరెడ్డి మహేశ్వర్ రెడ్డి శుక్రవారం తన పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని యార్డ్ కార్యదర్శి కల్పనకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు సేవ చేసే అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పండుగ సామరస్యంగా జరుపుకోవాలి



ఆళ్లగడ్డలో మాట్లాడుతున్న సీఐ రమేష్‌బాబు



గోస్పాడులో మాట్లాడుతున్న ఎస్‌ఐ నాగార్జునరెడ్డి

ఆళ్లగడ్డ: బక్రీద్ పండుగను సామరస్యంగా జరుపుకోవాలని పట్టణ సీఐ రమేష్‌బాబు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. హాజరైన అన్ని మతాల వారితో ఆయన మాట్లాడతూ శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడకుండా సంయమనంతో వ్యవహరించాలన్నారు. ఎస్‌ఐ నగీన ఉన్నారు.

గోస్పాడు: బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో శుక్రవారం ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలన్నారు.

చాగలమర్రి: ఈ నెల 17వ తేదీన బక్రీద్ పండుగను ప్రశాంత వాతవరణంలో జరుపుకోవాలని ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అందరూ ఐక్యమత్యంతో మెలగాలన్నారు. ఏఎస్‌ఐ షేక్ అబ్దుల్ నబీ, ప్రభుత్వ ఖాజీ ముల్లా యూనుస్‌బాషా, మాజీ సర్పంచ్ ఎం.ఎస్.అన్సర్‌బాషా, ముల్లా షబ్బీర్ ఆహ్మద్, ముల్లా హనీఫ్, గుత్తి నరసింహులు, ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు లక్ష్మణబాబు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రైండర్లు, పిండి మిషన్ల పంపిణీ



గ్రైండర్లను అందజేసిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని పలువురు ఆర్యవైశ్యులకు జీవనాధారం నిమిత్తం రూ.2 లక్షల విలువజేసే గ్రైండర్లు, పిండి మిషన్లు శుక్రవారం పంపిణీ చేశారు. శ్రీ వాసవి భవనంలో భవనాశి ట్రస్ట్ నిర్వాహకులు, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి మహేష్, నంద్యాల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి వాసు, దియ్యాల మధుసూదన రావు, మారుతి మెడికల్ అధినేత రెంటాల మారుతీ కుమార్, మరికొందరి సహకారంతో వాటిని పంపిణీ చేశారు. అనంతరం దాతలను ఘనంగా సన్మానించారు. బైసాని రామశేషు, అడ్డగాల్ల మధుసూధన్ రావు, మిరియాల రామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

నూతన చికిత్సలపై వైద్యులకు అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ మాధవ్

నంద్యాల టౌన్: వైద్యులు నూతన వైద్య చికిత్స విధానాలపై అవగాహన కలిగి ఉండాలని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఓ ప్రైవేట్ హోటల్‌లో నంద్యాల ప్రాంతంలోని వైద్యులకు నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో, హైదరాబాద్ సోమాజిగూడ యశోద ఆసుపత్రి సహకారంతో తుంటి కీలు మార్పిడి శస్త్ర చికిత్స, ఆధునిక విధానాలు, బ్లడ్ క్యాన్సర్‌లో ఆధునిక చికిత్స అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. రవికృష్ణ మాట్లాడుతూ ఇలాంటి సదస్సుల ద్వారా నూతన చికిత్సలపై అవగాహన కల్పిస్తామని, తద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. యశోద ఆసుపత్రి క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ మాధవ్ దంతాల మాట్లాడుతూ ప్రాథమిక దశలో గుర్తించిన క్యాన్సర్లకు చక్కటి సత్ఫలితాలు ఉంటాయన్నారు. క్యాన్సర్‌కు సంబంధించిన అవగాహన ప్రజల్లో పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఐఎంఏ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి,నంద్యాల ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ వసుధ అధ్యక్షతన, కార్యదర్శి డాక్టర్ పనిల్, డాక్టర్ ఉదయ్ కృష్ణ మైనేని, డాక్టర్ సహదేవుడు, వైద్యులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా అంగన్‌వాడీ బడిబాట



ప్రీ ప్రైమరీలో చేరటానికి చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం



జగనన్న ప్రభుత్వంలో ‘మోడల్ ఫౌండేషన్ స్కూల్’గా ఎంపికైన కేపీ తండా అంగన్‌వాడీ కేంద్రం

చాగలమర్రి: మండలంలోని కదిరిపురం తండాలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీలమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసినఅంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం ఉల్లాసంగా జరిగింది. ఇందుకు సర్పంచ్ లక్ష్మీబాయి, ఎఫ్‌ఎల్‌ఎన్ జిల్లా కో–ఆర్డినేటర్ ఏర్వ భాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సుశీలమ్మ మాట్లాడుతూ మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రాథమిక విద్యను అభివృద్ధి చేయడంలో భాగంగా గత ప్రభుత్వం ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమం చేపట్టి ‘మోడల్ ఫౌండేషన్ స్కూల్’గా ఉమ్మడి జిల్లాలో ఈ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపిక చేసి, రూ.10 లక్షలు మంజూరు చేసిందన్నారు. కేంద్రాన్ని ఆదర్శవంతంగా తీర్చి దిద్దేందుకు భవనానికి రంగులతో కూడిన బొమ్మలు, తరగతి గదిలో, బయట ఆవరణంలో చిన్నారులు ఆడుకోవటానికి వీలుగా బొమ్మలు, ఇన్నర్ వీల్స్ తదితర వాటిని ఏర్పాటు చేసిందని చెప్పారు. అనంతరం ప్రీ ప్రాథమిక పాఠశాలలో చేరుతున్న 5 సంవత్సరాలు దాటిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ యూనిఫాం ధరింపజేసి ప్రీ స్కూల్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కె.శంకర్, హనుమానాయక్, అంగన్‌వాడీ కార్యకర్తలు హసీన, వహిదా, రజిని, నాగలక్ష్మీ, చంద్రకళ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(అర్బన్): పెట్రోల్, డీజల్ సబ్సిడీపై పొందేందుకు నంద్యాల జిల్లా దివ్యాంగుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఉమ్మడి జిల్లా సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏదైనా సొంతంగా వ్యాపారం చేస్తూ, గుర్తింపు పొందిన ప్రైవేటు సంస్థల్లో విధులు నిర్వహిస్తూ సొంతంగా మూడు చక్రాల మోటరైజ్డ్ వాహనం కలిగి ఉన్న దివ్యాంగులకు సబ్సిడీపై పెట్రోల్, డీజల్‌ను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు సదరన్ సర్టిఫికెట్, రేషన్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ఉద్యోగం చేస్తున్న సంస్థ ధ్రువీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలను దరఖాస్తుకు జత చేసి సంబంధిత కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్ 08518-277864 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సూర్యనారాయణపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(వ్యవసాయం): ఏపీ సిటీ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన కేఆర్ సూర్యనారాయణపై సస్పెన్షన్ కొనసాగించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ది కమర్షియల్ ట్యాక్సెస్ ఎన్‌జీఓస్ అసోసియేషన్ కర్నూలు డివిజన్ అధ్యక్షుడు కమలాకర్, కార్యదర్శి మురళీకృష్ణ కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

చాగలమర్రిలో భారీ వర్షం



జలమయమైన గాంధీ సెంటర్

చాగలమర్రి: మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం నుంచి కురుస్తున్న మోస్తరు వర్షానికి గ్రామంలోని ప్రధాన రహదారులు, పలు వీధుల్లో రోడ్లు జలమయమయ్యాయి. తహసీల్దారు కార్యాలయ ఆవరణలో వర్షపు నీరు నిలిచిపోయింది. రాత్రి భారీ వర్షం కురవడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

ఆదర్శ ఆర్టీసీ ఉద్యోగులకు ప్రోత్సాహకాలు



ఉద్యోగికి ప్రశంసా పత్రం అందజేస్తున్న డిపో మేనేజర్ గంగాధర రావు

నంద్యాల టౌన్: స్థానిక ఆర్టీసీ డిపోలో గత నెలలో ఉత్తమ ప్రతిభ కనపరచిన ఉద్యోగులను డిపో మేనేజర్ గంగాధర రావు అభినందించారు. శుక్రవారం డిపో పరిధిలో ఉత్తమ ప్రతిభ కనపరచిన కండెక్టర్లు తిరుపాలు, రాజు, మల్లికార్జున, వెంకటేశ్వర్లు దస్తగిరి, డ్రైవర్లు డీ.ఎస్ రావు, ఎస్కే వలి, జీఎస్ ప్రసాద్, పీఎస్ రావు, బి.నాయుడు, ఖాసీలను అభినందించి ప్రశాంశ పత్రాలు, ప్రోత్సాహకాలు అందజేశారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ సమయ పాలన పాటిస్తూ ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడం వల్లే ప్రజలు ఆర్టీసీని ఆదరిస్తున్నారాన్నరు. డిపో అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటినాయుడు పాల్గొన్నారు.

మాన్యం కౌలుకు వేలం



తుడుములదిన్నెలో వేలాలు నిర్వహిస్తున్న ఈఓ

ఉయ్యాలవాడ: మండలంలోని తుడుములదిన్నె గ్రామంలో వెలసిన గణపతి, ఆంజనేయస్వామి, జనార్ధనస్వామి ఆలయ భూములకు సంబంధించి ఒక్క ఏడాది కౌలు సాగుకు శుక్రవారం దేవదాయశాఖ ఈఓ చంద్రుడు ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. 42.29 ఎకరాల భూమిని అదే గ్రామానికి చెందిన రైతులు రూ.2,56,500 కు దక్కించుకున్నారు. గత ఏడాది రూ.3.06 లక్షలు వచ్చిందని, ఈ ఏడాది రూ.48,500 ఆదాయం తగ్గిందని ఈఓ వెల్లడించారు. పోలీసు బందోబస్తు మధ్య జరిగిన వేలంలో ఇన్‌స్పెక్టర్ హరిచంద్రారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని వివిధ ఆలయాలకు చెందిన మాన్యం కౌలుకు వేలాలు నిర్వహిస్తున్నట్లు ఆలయాల ఈఓలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 15న చాకరాజువేముల, 17న క్రిష్టిపాడు, కొండాపురం గ్రామాల్లో వేలం పాటలు ఉంటాయని కార్యనిర్వహణాధికారి చంద్రుడు తెలిపారు. అలాగే 16న దొర్నిపాడులో వేలం నిర్వహిస్తామని ఈఓ వీరయ్య పేర్కొన్నారు. పాల్గొనేవారు డిపాజిట్ చెల్లించాలని సూచించారు.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో బోధన



చింతకుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన చేస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దస్తగిరమ్మ తెలిపారు. మన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణ శివారులోని చింతకుంటలో చిన్నారులతో కలిసి వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

రుద్రవరం: మూడేళ్లు పైబడిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, అలాగే ఐదేళ్లు దాటిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అంగన్‌వాడీ సూపర్ వైజర్ లక్ష్మీదేవి చిన్నారుల తల్లిదండ్రులకు సూచించారు. స్థానిక మూడో అంగన్‌వాడీ కేంద్రం వద్ద శుక్రవారం అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు,తల్లులతో అంగన్‌వాడీ బాట నిర్వహించారు.


విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి



మాట్లాడుతున్న ఎంఈఓ కోటయ్య

రుద్రవరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పరచాలని ఎంఈఓలు కోటయ్య, లక్ష్మి తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో సమావే శం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పాఠశాలల్లో వంద శాతం అడ్మిషన్లు పూర్తి చేయాలని సూచించారు. నాడు–నేడు కింద బడుల్లో పెండింగ్ పనులు ఉంటే పూర్తి చేయాలని చెప్పారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం రుచికరంగా వండి విద్యార్థులకు వడ్డించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

చోరీ కేసు నిందితుడి అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ షర్ఫుద్దీన్

ఆళ్లగడ్డ: దొర్నిపాడు మండలం డబ్ల్యూ కొత్తపల్లెలో ఇటీవల జరిగిన చోరీ కేసులో దొంగను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం డీఎస్పీ షర్ఫుద్దీన్ వివరాలను వెల్లడించారు. గ్రామానికి చెందిన భూమా బ్రహ్మనందరెడ్డికి డ్రైవర్‌గా వ్యవహరిస్తున్న యోగీశ్వరరెడ్డి వ్యసనాలకు బానిస కావడంతో పాటు అక్క పెళ్లికి రూ.4లక్షల వరకు అప్పులు చేశాడు. బ్రహ్మనందరెడ్డి ఇంట్లో నమ్మకంగా ఉంటూనే ఇంటి తాళాలు తీసుకొని బంగారు నగలు, రూ.50వేల నగదు చోరీ చేశాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో అలా రెండుసార్లు దొంగతనానికి పాల్పడ్డాడు. అనుమానం రావడంతో భూమా బ్రహ్మనందరెడ్డి కుమారుడు భూమా సందీప్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. కారు డ్రైవరే నిందితుడిగా తేల్చారు. బంగారు డైమండ్ నెక్లెస్, మరో రెండు బంగారు నెక్లెస్‌లు, నాలుగు గాజులు, ఒక బంగారు డాలరు ఎత్తుకెళ్లాడు. అలాగే రూ.50వేల నగదు కూడా తస్కరించాడు. దొర్నిపాడు శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలో అరెస్టు చేసి సుమారు రూ.18.20లక్షల విలువజేసే సొమ్ము, నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. రూరల్ సీఐ హనుమంత్‌నాయక్, ఎస్‌ఐ సురేష్‌ను డీఎస్పీ అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలి

ఉయ్యాలవాడ: నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం విద్యా రంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారించాలని ఆర్‌జేయూపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం షరీఫ్, అధికార ప్రతినిధి వీరబ్రహ్మం శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రాథమిక పాఠశాలల విలీనానికి సంబంధించిన జీఓ 117 రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

రక్తదానం అలవాటు చేసుకోవాలి



రక్తదానం అనంతరం సర్టిఫికెట్ అందుకుంటున్న జడ్జి ఆదినారాయణ

నంద్యాల(వ్యవసాయం): ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడాన్ని అలవాటు చేసుకొని ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడటం బాధ్యతగా తీసుకోవాలని జడ్జీలు వాసు రాధారాణి, కిరణ్ కుమార్, ఆదినారాయణ, ఏసు రత్నం పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో బార్ అసోసియేషన్, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. వారు మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఎప్పుడూ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, భూపని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఒక యూనిట్ రక్తంతో నలుగురికి ప్రాణం పోస్తుందన్నారు. అనంతరం జూనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వసుధ, దస్తగిరి, న్యాయవాదులు రామచంద్రారావు, పీడీహెచ్ బాబు, గౌరీశంకర్, తిమ్మారెడ్డి, రఘుప్రకాష్, జయకృష్ణ, వివేకానందరెడ్డి పాల్గొన్నారు.